ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

కరీంనగర్
జిల్లా వార్తలు
5
సోమవారం 22 సెప్టెంబరు 2025

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు

ఇల్లందకుంట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హుజూరాబాద్ ఏసీపీ వాసంశెట్టి మాధవి హెచ్చరించారు. ఇల్లందకుంట మండలంలోని సిరిసేడు గ్రామంలో ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ మేరకు గ్రామంలోని ప్రతి ఇంటిలోని వాహనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాధవి మాట్లాడుతూ ప్రతి ఒక్క వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. సరైన పత్రాలు లేని 75 వాహనాలను సీజ్ చేశారు. కార్యక్రమంలో సీఐలు లక్ష్మీనారాయణ, రామకృష్ణ గౌడ్, ఎస్ఐలు క్రాంతికుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయ సాధనకు కృషి

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్


కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయ సాధనకు కృషి చేయాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. తెలంగాణ ఉద్యమ నేత కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూల మాల వేసి ఆదివారం నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం తన ఇంటినే త్యాగం చేసిన వ్యక్తి కొండాలక్ష్మణ్ బాపూజీ అన్నారు. కేసీఆర్ మొట్టమొదట పార్టీ పెడతానంటే తన ఇంటినే టీఆర్ఎస్ ఆఫీస్ (జలదృశ్యం) మార్చి తెలంగాణ రాష్ట్ర అంకురార్పణకు చేసిన మహనీయుడు బాపూజీ అన్నారు. హైదరాబాద్ సంస్థాన ప్రజలకు విముక్తి కోసం మీర్ ఉస్మాన్ అలీఖాన్‌పై బాంబు దాడికి వ్యూహం రచించి అమలు చేశారన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో నిర్బంధించిన నాయకుల కోసం పార్టీలతో నిమిత్తం లేకుండా న్యాయ సాయం చేసిన గొప్ప వ్యక్తి అన్నారు. 96 సంవత్సరాల వయస్సులో తెలంగాణ కోసం జంతర్‌మంతర్ వద్ద ఎముకలు కొరికే చలి లో దీక్షా చేశారని తెలిపారు. అనంతరం ప్రధాని మోదీ జన్మ దినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ నాయకులు రక్తదానం చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ మేయర్ వై సునీల్ రావు, వాసాల రమేష్, చంద్రశేఖర్, నర్సయ్య పాల్గొన్నారు.




గోకుల్‌నగర్ చౌరస్తాలో సంప్రదాయ వస్త్ర ధారణలతో బతుకమ్మ ఆట, ప్రకాశంగంజ్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు, బతుకమ్మలతో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుటుంబ సభ్యులు

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..

- అంబరాన్నంటిన చిన్న బతుకమ్మ సంబరాలు
- వాడవాడల మిన్నంటిన ఆనందోత్సాహాలు


మహాశక్తి ఆలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు




కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయ వస్త్రధారణలు.. రంగు రంగుల పూల బతుకమ్మలు.. పూల సోయగాన్ని సంతరించుకున్న వీధులు.. కోలాటాలు, దాండియా నృత్యాలు.. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన చిన్న బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. ఉదయం నుంచే పూల సేకరణ, వైవిధ్య భరిత బతుకమ్మల తయారీలో నిమగ్నమైన యువతులు, స్త్రీలు వివిధ పూలతో బతుకమ్మలను పేర్చి గౌరమ్మను నిలిపి పూజలు జరిపారు. నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం ఆలయాలు, వీధులు, కూడళ్ల వద్ద బతుకమ్మలను నిలిపి ఆటా పాటలతో సందడి చేశారు. రాత్రి సమీప, కృత్రిమ జలాశయాల్లో, చెట్లలో, ఆలయాల్లో బతుకమ్మలను పెట్టి వాయినాలు పంచుకున్నారు. ప్రకాశంగంజ్‌లో మహిళలు, పిల్లలు పెద్ద సంఖ్యలో బతుకమ్మ ఆడారు. రాంనగర్ రమా సత్యనారాయణస్వామి, అభయాంజనేయస్వామి ఆలయం ఎదట డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణి, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ నేతృత్వంలో మహిళలు బతుకమ్మ ఆడారు. గోకుల్‌నగర్ చౌరస్తాలో మహిళలు బతుకమ్మ ఆటా పాటలతో మైమరచిపోయారు. మహా శక్తి ఆలయంలో మహిళలు, యువతులు, చిన్నారులు బతుకమ్మ ఆటలతో, చప్పట్ల మోతలతో ఆలయ ప్రాంగణాన్ని మార్మోగించారు. వేడుకల్లో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి సతీమణి బండి అపర్ణ పాల్గొన్నారు. మార్క్‌ఫెడ్ గ్రౌండ్‌లో భారీ సంఖ్యలో మహిళలు బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బోనాల శ్రీకాంత్ పాల్గొన్నారు. నగరంలోని అన్ని డివిజన్లు, ఆలయాల్లో బతుకమ్మ ఆటా పాటల సందడి కనిపించింది. ఆయా డివిజన్‌ల మాజీ కార్పొరేటర్లు, వివిధ పార్టీ నాయకులు ఏర్పాట్లు చేశారు.


రాంనగర్‌లో..




రాంనగర్ రమాసత్యనారాయణస్వామి ఆలయం వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు, యువతుల నృత్యాలు, బతుకమ్మ ఆడుతున్న మాజీ డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణి

మండపాలకు తరలిన దుర్గామాత మూర్తులు



కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పలు ప్రాంతాలతోపాటు నగర శివారు ప్రాంతాల్లో తయారైన దుర్గామాత మూర్తులు ఆదివారం మండపాలకు తరలాయి. భక్తులు, మండపాల నిర్వాహకులు దారి పొడవునా భజనలు, భక్తి గీతాలు ఆలపించారు. దీంతో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. సోమవారం ఉదయం, సాయంత్రం వేళల్లో అమ్మవార్లను ఆయా మండపాల్లో ప్రతిష్ఠించి పూజలు జరుపనున్నారు.

ఆదాయం పెంపునకు చర్యలు

- రెసిడెన్షియల్ టాక్సు చెల్లిస్తున్న కమర్షియల్ భవనాలపై దృష్టి
- విద్యుత్ మీటర్ల ఆధారంగా దాదాపు 10 వేల ఇళ్ల గుర్తింపు
- ఆస్తి పన్ను మదింపుపై పునఃపరిశీలన

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ ఆదాయాన్ని పెంచుకునేందుకు చర్యలు చేపట్టింది. ప్రధాన ఆదాయ వనరైన ఆస్తి పన్ను మదింపుపై ప్రత్యేక దృష్టి సారించింది. నగరపాలక సంస్థ పరిధిలోని పలు భవనాలకు నివాస గృహాలుగా ఆస్తిపన్ను చెల్లిస్తూ వాణిజ్య అవసరాలకు వాటిని వినియోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. విద్యుత్ మీటర్ల ఆధారంగా పునఃపరిశీలన చేసి ఆస్తిపన్నులను వాణిజ్య విభాగంలోకి చేర్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

కమర్షియల్ విద్యుత్ మీటర్లు 34 వేలు.. భవనాలు 14 వేలు

నగరంలో కమర్షియల్ విద్యుత్ మీటర్లు 34 వేల వరకు ఉండగా, నగర పాలక సంస్థలో 14 వేల భవనాలకు మాత్రమే కమర్షియల్ టాక్సును చెల్లిస్తున్నారు. దీంతో మిగిలిన 20వేలలో కొంత మంది ఇంటి నిర్మాణ సమయంలో టెంపరరీగా విద్యుత్ మీటర్లను, అపార్టుమెంట్లు, పెద్దపెద్ద భవనాల్లో లిఫ్ట్, ఇతర అవసరాల కోసం కమర్షియల్ మీటర్లు తీసుకున్నట్లు తెలిసింది. అలాంటివి పోగా మరో 10 వేల వరకు రెసిడెన్షియల్ టాక్సు చెల్లిస్తూ వాణిజ్య అవసరాలకు భవనాలను వినియోగిస్తున్నట్లు అధికారులు నిర్ధారణకు వచ్చారు.

దీంతో కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్ ఆదేశాల మేరకు డిప్యూటీ కమిషనర్, రెవెన్యూ అధికారులు, వార్డు ఆఫీసర్లు కమర్షి యల్ మీటర్ ఇంటి నంబర్ల ఆధారంగా ప్రాపర్టీ టాక్సును నిర్ధారించే పని లో నిమగ్నమయ్యారు. కొన్ని చోట్ల రోడ్లకు ఆనుకొని ఉన్న ఇంట్లో లేదా భవనంలో నివాసముంటూనే ఖాళీ స్థలాల్లో షట్టరు వేసి వాణిజ్య అవసరా లకు వినియోగిస్తున్నట్లు తెలిసింది. ఇలాంటి వాటిని గుర్తించి వాటికి కమర్షియల్ టాక్సు వసూలు చేస్తే ఆస్తిపన్నుల ద్వారా వచ్చే ఆదాయం పెరుగుతుందని భావిస్తున్నారు.



పన్నుల సవరణలో అధికారులు

వార్డు ఆఫీసర్లు, రెవెన్యూ అధికారులే కాకుండా కమిషనర్, డిప్యూటీ కమిషనర్లు పునఃపరిశీలనలో పాల్గొని వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న ఇళ్ల విస్తీర్ణాన్ని బట్టి ఆస్తి పన్నులను సవరించేందుకు నోటీసులు జారీ చేస్తున్నారు. సంబంధిత ఇంటి యజమానుల డాక్యుమెంట్లను పరిశీలించి పన్నులను సవరిస్తున్నారు. ఇప్పటికే భువన్ యాప్ ద్వారా గ్రౌండ్ ఫ్లోర్‌కు పన్నులు చెల్లించి ఆపై అంతస్తులను నిర్మిస్తే వాటిని సవరించడం ద్వారా బల్దియా ఆదాయం పెరిగింది. కమర్షియల్‌కు వినియోగిస్తున్న ఇళ్లకు ఆ కేటగిరీ టాక్సు వేయడం ద్వారా మరింత ఆదాయం పెరుగుతుందని భావిస్తున్నారు.

గ్రామాల విలీనంతో పెరిగిన నగర విస్తీర్ణం

నగరంలో కొత్తపల్లి మున్సిపాలిటీతోపాటు శివారులోని పద్మనగర్, చింతకుంట, మల్కాపూర్, రేకుర్తి, సీతారాంపూర్, ఆరెపల్లి, తీగలగుట్టపల్లి, వల్లంపహాడ్, గోపాల్‌పూర్, దుర్శేడ్, బొమ్మకల్, సదాశివపల్లి, అల్గునూర్ గ్రామాలను విలీనం చేయడంతో నగర విస్తీర్ణం దాదాపు రెట్టింపు అయింది. విలీన గ్రామాలతో కలిపి డివిజన్ల సంఖ్య 66కు చేరింది. అలాగే జనాభా కూడా నాలుగు లక్షలకుపైగానే ఉన్నది.

ఇటీవల చేసిన విలీన గ్రామాలకు ముందు 60 డివిజన్లలో అధికారిక లెక్కల ప్రకారం 90 వేల వరకు నివాస, వాణిజ్య భవనాలు ఉండేవి. గ్రామాల విలీనంతో భవనాల సంఖ్య 1,02,000కు చేరింది. ఆస్తిపన్ను ద్వారా నగరపాలక సంస్థ ఏటా ప్రభుత్వ, ప్రభుత్వరంగ, ప్రైవేట్ నివాస, వాణిజ్య గృహాల ద్వారా యేటా 59.14 కోట్ల మేరకు ఆదాయం వస్తుందని అంచనా వేశారు. ఆస్తి పన్ను ను సవరించడం ద్వారా పెరిగే ఆదాయంతో అభివృద్ధి పనులకు నిధులను ఖర్చుచేసే అవకాశాలుంటాయని చెబుతున్నారు.

గతించిన పెద్దలకు బియ్యాలు

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మహాలయ అమావాస్య సందర్భంగా అన్ని వర్గాల ప్రజలు తమ కుటుంబంలో గతించిన పెద్దలకు బియ్యాలు ఇచ్చుకున్నారు. పితృతర్పణాలు, శ్రాద్ధాలు నిర్వహించారు. దీంతో ఆదివారం ఆలయాలు, గృహాలు సందడిగా మారాయి. ఆనవాయితీ ప్రకారం గ్రామాల్లో పురోహితులను, నగరంలో బ్రాహ్మణులను ఇళ్లకు ఆహ్వానించి బియ్యం, పప్పు, ఉప్పు, కూరగాయలు వగైరా సమర్పించారు. సంకల్పం చెప్పించుకున్నారు. గతించినవారిని స్మరించుకొని వారి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. వారికి ఇష్టమైన పదార్థాలు, పిండి వంటలు చేసుకొని నైవేద్యాలు పెట్టి కుటుంబ సభ్యులతో కలిసి తిన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేయరు..

గుంతలమయంగా మారడంతో నిలిచిపోయిన ఆర్టీసీ బస్సులు


శంకరపట్నం మండలం రాజాపూర్‌లో రోడ్డుపై ఏర్పడ్డ గుంతలు

శంకరపట్నం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రోడ్డుకు మరమ్మతులు చేసి ఆర్టీసీ సేవలు పునరుద్ధరించాలని రెండు గ్రామాల ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. శంకరపట్నం మండలం రాజాపూర్, కాచాపూర్ గ్రామాలకు రోడ్డు గుంతలమయంగా మారడంతో ఆర్టీసీ బస్సులను నిలిపివేశారు. గద్ద పాక, కాచాపూర్ గ్రామాల మధ్య ఉన్న చెరువు మత్తడి వద్ద రోడ్డు ప్రమాదకరంగా ఉండడంతోపాటు కన్నాపూర్-రాజాపూర్, రాజాపూర్-కాచాపూర్ గ్రామాల మధ్య రోడ్డు గుంతలమయంగా మారింది. కొన్ని రోజులుగా ఆర్టీసీ బస్సులు రాకపోవడంతో గ్రామస్థులు, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వ యంత్రాంగం ఈ రోడ్డుపై దృష్టి సారించి మరమ్మతులు చేయించాలని ఆ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


గద్దపాక-కాచాపూర్ గ్రామాల మధ్య నీటి ప్రవాహంతో కోతకు గురైన లో లెవెల్ బ్రిడ్జి



టాస్క్‌ఫోర్స్ సీఐ రవీందర్‌పై వేటు

ఐజీకి అటాచ్డ్ చేస్తూ ఉత్తర్వులు జారీ

'లీక్'లు, అవినీతిపై కొనసాగుతున్న విచారణ

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): టాస్క్‌ఫోర్స్ విభాగంలో సీఐగా పనిచేస్తున్న రవీందర్‌పై వేటు పడింది. సీఐ రవీందర్‌ను ఐజీకి అటాచ్డ్ చేస్తూ శనివారం రాత్రి కరీంనగర్ సీపీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. అక్రమ దందాలపై ఉక్కుపాదం మోపి, సామాన్యులకు న్యాయం జరిగే విధంగా పోలీస్ కమిషనర్ పర్యవేక్షణలో టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు. చాలా కాలంగా బదిలీలు లేకుండా ఆ విభాగంలో పాతుకుపోయిన సిబ్బంది, కొందరు అధికారులు అవినీతికి తెర లేపారనే విమర్శలు వచ్చాయి. దాడులకు సంబంధించి ముందస్తుగా సమాచారాన్ని అక్రమార్కులకు అందజేశారనే ఆరోపణలున్నాయి. దీంతో పోలీస్ బాస్ ప్రత్యేక విచారణ జరిపించి నాలుగు రోజుల కిందటే ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఎస్ఐతోపాటు తొమ్మిది మందిపై బదిలీ వేటు వేశారు. తాజాగా టాస్క్‌ఫోర్స్‌లో సీఐగా పని చేస్తున్న రవీందర్‌పై కూడా వేటు పడింది. సీఐని ఐజీకి అటాచ్డ్ చేశారు. టాస్క్‌ఫోర్స్ లీక్ వీరులు, ఇసుక ముడుపులపై ఇంకా విచారణ కొనసాగుతోంది. మరో అధికారి ప్రమేయంపై కూడా లోతుగా విచారణ జరుపుతున్నట్లు సమాచారం. ఇసుక వ్యవహారంలో పెద్ద ఎత్తున ముడుపులు చేతులు మారినట్లుగా ప్రచారం జరుగుతున్నది. మానకొండూర్ నియోజకవర్గంలోని పలువురు పోలీసు అధికారులు ఇసుక వ్యవహారంలో అక్రమాలకు పాల్పడినట్లుగా ఫిర్యాదులు అందాయని తెలిసింది.

మరో విభాగంపైనా పోలీస్ బాస్ దృష్టి

టాస్క్‌ఫోర్స్‌తో పాటు మరో నిఘా విభాగంలో కూడా అవినీతిపై ఆరోపణలు పోలీస్‌బాస్‌కు అందాయని, దీనిపై కూడా దృష్టి సారించినట్లు సమాచారం. ఈ విభాగం కొన్ని దరఖాస్తులను వెరిఫికేషన్ చేయాల్సి ఉంటుఇంది. వెరిఫికేషన్ సమయంలో భారీగా డబ్బులు గుంజుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. క్రిమినల్ కేసులున్నాయా? లేవా? అనేది వెరిఫికేషన్ పూర్తి చేసి రిపోర్ట్ ఇవ్వాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా చిన్న చిన్న సాంకేతిక కారణాలను చూపుతూ రిజెక్ట్ చేయటం వంటివి చేస్తూ డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదు వచ్చాయి. దీనిపై కూడా పోలీస్‌బాస్ రహస్యంగా విచారణ జరుపుతున్నట్లు సమాచారం. ఈ విభాగంలోనూ భారీ ప్రక్షాళన జరిగే అవకాశముంది. ప్రస్తుతం సెలవులో ఉన్న పోలీస్ బాస్ తిరిగి రాగానే చర్యలకు ఉపక్రమించే అవకాశముంది.

మద్యం మానేయాలని మందలించినందుకు వృద్ధుడి ఆత్మహత్య


రాజయ్య(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన ఓ వ్యక్తిని కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్థాపం చెందిన ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లో పండుగ పూట ఆదివారం విషాదం నింపింది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గ్రామంలోని రాయికోటి రాజయ్య(61) కొంత కాలంగా గల్ఫ్ దేశానికి వెళ్లి వస్తుండేవాడు. ఏడాది కిందట స్వగ్రామానికి చేరుకున్న ఆయన స్థానికంగా దినసరి కూలీ పనులు చేస్తున్నాడు. అనారోగ్యంలో బాధపడుతున్న రాజయ్యను కుటుంబసభ్యులు పలు ఆసుపత్రుల్లో చూపించి వైద్యం అందించారు. ఆరోగ్యం కుదుట పడకపోవడంతో మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో కుటుంబ సభ్యులు మద్యం మానేయాలని రాజయ్యను ఈనెల 20న మందలించారు. మనస్థాపం చెందిన ఆయన రేకుల షెడ్డులో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడికి భార్య శోభారాణి, కొడుకు బాబు, ఇద్దరు కూతుళ్లు తిరుమల, రాజేశ్వరిలు ఉన్నారు. మృతుడి భార్య శోభారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ మోతీరాంనాయక్ పేర్కొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ బలవన్మరణం

● పెళ్లయి ఆరు నెలలు ● చందుర్తిలో విషాదం


అరవింద్(ఫైల్)

చందుర్తి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పెళ్లయిన ఆరు నెలలకే ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కుటుంబ కలహాలతో నిద్రమాత్రలు మింగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన వికారాబాద్ జిల్లాఅటవీప్రాంతంలో జరగగా, చందుర్తి మండల కేంద్రంలో విషాదం నింపిన సంఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. చందుర్తి మండల కేంద్రానికి చెందిన ద్యావనపల్లి లక్ష్మి-రాజు దంపతుల ఏకైక కుమారుడు అరవింద్(30) వివాహం కరీంనగర్‌లోని జూబ్లీనగర్‌కు చెందిన తుమ్మ స్వరూపరాణి-శ్రీనివాస్ దంపతుల కుమార్తె వినూత్నతో గతమార్చి2న వివాహం జరిగింది. భార్యభర్తలు ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు కావడంతో హైదరాబాదులోని కొండాపూర్ ప్రాంతంలో నివాసం ఉంటూ ఉద్యోగాలు చేస్తున్నారు. ఈనెల 19న కుటుంబ కలహాలతో అరవింద్ ఇంటి నుంచి బయటకు వెళ్లి వికారాబాద్ అటవీప్రాంతంలో నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యకు పాల్పడగా అక్కడి పోలీసులు గుర్తించి, రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండల కేంద్రంలో ఉంటున్న తల్లిదండ్రులకు పోలీసులు ఈనెల 20న రాత్రి సమాచారం అందించారు. భార్య వినూత్న ప్రస్తుత గర్భవతని పేర్కొన్నారు. పెళ్లయిన ఆరు నెలలకే అరవింద్ ఆత్మహత్యకు పాల్పడడంతో చందుర్తిలో విషాదఛాయలు అల్లుకున్నాయి.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి


మల్లేష్ నాయక్(ఫైల్)

ధర్మారం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పంట పొలాన్ని నష్టపరుస్తున్న పక్షులను తోలడానికి వెళ్లిన ఓవ్యక్తి విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన ఘటన మండలంలోని కొత్తపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన భూక్య మల్లేష్ నాయక్(45) పొలాన్ని నష్టపరుస్తున్న పక్షులను తోలడానికి ఆదివారం మధ్యాహ్నం వెళ్లాడు. ఈ ప్రయత్నంలో పక్షులు బెదిరే కలర్ రిబ్బన్‌కు ఒక వైరును కట్టి 11కేవీ వైర్లకు వేయగా ప్రమాదవశాత్తు రిబ్బన్ ద్వారా విద్యుత్ సరఫరా అయ్యి మల్లేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. మల్లేష్ భార్య భూక్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

గుడుంబా విక్రయదారుడిపై కేసు నమోదు

ధర్మారం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి గ్రామంలో గుడుంబా తయారు చేసి అమ్ముతున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కొత్తపల్లి గ్రామానికి చెందిన భూక్య మోతిలాల్ నాయక్ పొలంలో గుడుంబా తయారు చేస్తూ ఇంటి వద్ద విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఆదివారం మోతిలాల్ ఇంటిని తనిఖీ చేసి 12 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని, అతనిపై కేసు నమోదు చేశారు. నాటుసారా తయారు, విక్రయించిన, సరఫరా చేసిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని ధర్మారం ఎస్‌ఐ ప్రవీణ్ కుమార్ హెచ్చరించారు.

మెప్మా ఆర్పీలకు తప్పని తిప్పలు


జగిత్యాల కలెక్టరేట్‌కు తరలివచ్చిన మెప్మా రిసోర్స్‌పర్సన్లు

● పీఆర్సీ అమలు కోసం ఎదురుచూపులు
● కనీస గౌరవ వేతనం రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్
● రాష్ట్రంలో ఆరు వేల మంది మెప్మా రిసోర్స్‌పర్సన్లు

జగిత్యాల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాంతాల్లో స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థిక అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) రిసోర్స్ పర్సన్లు (ఆర్పీ) కనీస గౌరవ వేతనం దక్కక ఇబ్బందులు పడుతున్నారు. ఆర్పీలకు పీఆర్సీ అమలు కాక పోవడంతో రూ.6 వేల గౌరవ వేతనం మాత్రమే అందడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహిళలకు నిధులు సమకూర్చడం, శిక్షణ ఇవ్వడం వంటి పనులను ఆర్పీలు పూర్తి చేస్తారు. పట్టణాల్లోని పొదుపు సంఘాల మహిళలకు ఆర్థికంగా అండగా నిలుస్తుంటారు. సంఘాల కార్యకలాపాలు సక్రమంగా జరిగేలా చూడడంలో కీలక పాత్ర పోషిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆయా మున్సిపాలిటీల్లో 6 వేల మంది మెప్మా రిసోర్స్ పర్సన్లుగా పనిచేస్తున్నారు. జగిత్యాల జిల్లాలో 173 మంది మెప్మా ఆర్పీలు పనిచేస్తున్నారు.

నెలకు రూ. 600 నుంచి పనిచేస్తున్న ఆర్పీలు..

రెండు దశాబ్దాల క్రితం ప్రభుత్వం మెప్మా ఆర్పీలకు నెలకు 600 పారితోషికం అందించేది. 2018 నుంచి ఆర్పీలకు ప్రభుత్వం నుంచి నెలకు నాలుగు వేల రూపాయల గౌరవ వేతనం, పట్టణ సమాఖ్య నుంచి మరో రెండు వేల రూపాయలు కలిపి ఆరు వేల రూపాయల చొప్పున గౌరవ వేతనాన్ని స్త్రీ నిధి ద్వారా చెల్లిస్తున్నారు. ఇచ్చే తక్కువ వేతనం కూడా ప్రభుత్వం ఇవ్వకుండా స్త్రీ నిధి ద్వారా పారితోషికం పేరుతో ఇవ్వడాన్ని పలువురు ఆర్పీలు వ్యతిరేకిస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అనేక పర్యాయాలు మంత్రులు, కలెక్టర్లుకు వినతిపత్రాలు సమర్పించినా ఫలితం లేకపోయిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద ధర్నా చేశారు. అయినా వారి సమస్య పరిష్కారం కాలేదు. ఇటీవల జగి త్యాల జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయానికి మెప్మా ఆర్పీలు తరలివచ్చి తమ అసంతృప్తిని వ్యక్తం చేయడంతో పాటు అధికారులను కలిసి సమస్యను విన్నవించుకున్నారు. కనీస గౌరవ వేతనం ఏ నెలకు ఆ నెల అందించాలని సంబంధిత అధికారులను కోరారు.

30 శాతం పీఆర్సీ అమలుకు డిమాండ్..

జీవో నంబరు 164 ప్రకారం స్త్రీనిధి, లోకల్ బాడీ నిధుల నుంచి ఆర్పీలకు గౌరవ వేతనాలు ఇవ్వాలనే నిబంధనను తొలగించి సెర్ప్ (గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ) వీఓఏల మాదిరిగా ప్రభుత్వ పరంగా ప్రత్యేక నిధులు కేటాయించి గౌరవ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. నెలకు రూ.20 వేల గౌరవ వేతనం అందించాలని కోరుతున్నారు. గౌరవ వేతనాన్ని ఏ నెలకు ఆ నెల స్వంత ఖాతాల్లో జమ చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తం గా ఆర్పీలకు ఒకే రకమైన డ్రెస్ కోడ్ ఉండేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరు తున్నారు.

గత ప్రభుత్వం అన్ని రంగాల వారికి 30 శాతం పీఆర్సీ అమలు చేసి మెప్మా ఆర్పీలను మాత్రం విస్మరించిందని అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. సెర్ప్ వీఓఏల మాదిరిగా మెప్మా ఆర్పీలకు పీఆర్సీ అమలు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మెప్మా ఆర్పీలకు ఉద్యోగ భద్రత, ఆరోగ్య భద్రత కల్పించాలని కోరుతున్నారు. పని భారం తగ్గించాలని, హెచ్‌ఆర్‌పీ అమలు చేయాల ని వారు డిమాండ్ చేస్తున్నారు. మెప్మా కార్యకలా పాల్లో బాగంగా వివిధ సర్వేలు నిర్వహిస్తామని ఇప్పటికైనా ప్రభుత్వం మెప్మా ఆర్పీల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరుతున్నారు.

పీఆర్సీఅమలు చేయాలి

రమ, జిల్లా మెప్మా రిసోర్స్ పర్సన్ సంఘం అధ్యక్షురాలు, జగిత్యాల



ప్రభుత్వం మెప్మా రిసోర్స్ పర్సన్లకు 30 శాతం పీఆర్సీ అమలు చేయాలి. ప్రతీ నెల సక్రమంగా వేతనాలు చెల్లించాలి. అరకొరగా ఇస్తున్న గౌరవ వేతనాలు సైతం ఎప్పటికప్పుడు అందించక పోవడంతో ఆర్థికంగా అవస్థలు ఎదుర్కొం టున్నాం. మెప్మా ఆర్పీలకు నెలకు రూ.20వేల గౌరవ వేతనం అందించాలి.

ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లాం

దుర్గపు శ్రీనివాస్‌గౌడ్, మెప్మా అధికారి, జగిత్యాల



మెప్మాలో పనిచేస్తున్న ఆర్పీల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. సమస్యను పరిష్కరించడానికి అవసరమైన ప్రయత్నాలు చేస్తున్నాం. మెప్మా ఆర్పీల డిమాండ్లను రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వం పరిష్కరించాల్సి ఉంటుంది.

రైల్వేస్టేషన్ గదిలో విందు


గదిలో మద్యం బాటిళ్లు

ఓదెల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో శనివారం రాత్రి టికెట్ కౌంటర్ గదిలో రైల్వే కమర్షియల్ అధికారులు విందు చేసుకున్నారు. రాత్రి 10గంటల తర్వాత రైల్వేస్టేషన్‌లో కేకలు, కేరింతలు వినబడడంతో స్టేషన్‌సమీపంలో ఉండే ఓవ్యక్తి విందును సెల్‌ఫోన్‌లో చిత్రీకరించాడు. దీనిని గమనించిన కొందరు అధికారులు వారించారు. అయినప్పటికీ చిత్రీకరించిన వీడియోను వాట్సప్‌లో వైరల్ చేయడంతో విషయం బయటకు వచ్చింది. ఇందులో కమర్షియల్ అధికారులతోపాటు కొందరు టీసీలు కూడా ఉన్నట్లు సమాచారం. ఈవ్యవహారం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినట్లు సిబ్బంది తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఇల్లంతకుంట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై లక్ష్మి తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. మండలంలోని వంతడుపుల గ్రామసమీపంలోని బిక్కవాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారనే సమాచారం మేరకు దాడిచేయగా ట్రాక్టర్ పట్టుబడినట్లు తెలిపారు. ట్రాక్టర్ యజమాని ముద్దల అజయ్, డ్రైవర్ దాసరి సిద్ధార్థలపై కేసునమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. నిబంధనలు అతిక్రమించి ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఉమ్మడి జిల్లా స్థాయి భగవద్గీత పఠన పోటీలు


విజేతలైన విద్యార్థులతో అతిథులు

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ కల్యాణ మండపంలో ఆదివారం చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాస్థాయిలో విద్యార్థులకు భగవద్గీత పఠనపోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మిషన్ ఇన్‌చార్జి అక్షయ చైతన్య మాట్లాడుతూ గీతతో సత్ప్రవర్తన, జ్ఞాపకశక్తి, దేశభక్తి అలవడుతాయన్నారు. ఆధ్యాత్మిక మార్గంతో జీవనవిధానం మెరుగుపడుతుందన్నారు. మొత్తం 2వేల మంది విద్యార్థులకు గీతా శ్లోకాలు నేర్పించామన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఆలయ ట్రస్టు చైర్మన్ చిట్టుమల్ల శ్రీనివాస్, మిషన్ ప్రధాన కార్యదర్శి గజవాడ శ్రీనివాస్, జలంధర్, కొండయ్య, రజనీకాంత్, చంద్రం, వసంతం, అనుదీప్, విఘ్నేశ్వర్, శ్రీనివాస్, తిరుపతి, సుదర్శన్, రాజేశ్వర్ తదితరులు పాల్గొ న్నారు.

● జిల్లా స్థాయి విజేతలు

ప్రతీ గ్రూపులో ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులు అందించగా బి లో వేదాంశ్, సుధేష్ణ, వినయ్, సిలో కె.అద్వైత్, ఎం. సాన్విక, ఇ.స్నితిక, డిలో మ్యాన శ్రీహిత, బి.మనస్వి, పి.వర్షిత్, ఈ లో శ్రీశాన్వి, కె.తేజస్వి, గాజుల తేజస్వి గెలుపొందారు. వీరికి త్వరలో రాష్ట్ర స్థాయిలో పోటీలు నిర్వహించనున్నారు.

వ్యవసాయబావిలో పడి వృద్ధురాలు మృతి

మానకొండూర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముంజంపల్లి గ్రామానికి చెందిన గట్టు నర్సమ్మ(85) అనే వృద్ధురాలు వ్యవసాయ బావిలో పడి మృతి చెందింది. సీఐ సంజీవ్ తెలిపిన వివరాల ప్రకారం.. ముంజంపల్లికి చెందిన నర్సమ్మకు కొంత కాలంగా మానసిక స్థితి సరిగా లేదు. ఈ నెల 17న తిమ్మాపూర్ మండలంలోని పొరండ్ల గ్రామంలో ఉండే కూతురు వద్దకు వెళ్లింది. అక్కడి నుంచి 19న ముంజంపల్లికి ఆటోలో వచ్చి సమీపంలోని వ్యవసాయబావిలో పడింది. ఆదివారం వ్యవసాయబావిలో మృతదేహాన్ని గుర్తించిన ఓ రైతు గ్రామస్థులకు తెలియజేయడంతో అక్కడికి వెళ్లి చూడగా నర్సమ్మగా గుర్తించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసారు. శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుమారుడు వెంకటి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మానేరు వాగులో పడి ఒకరి మృతి


రవీందర్‌గౌడ్(ఫైల్)

ఓదెల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంపుల మానేరువాగులో ఆదివారం ఇల్లంతకుంట మండలం రాచపల్లికి చెందిన ఆరెల్లి రవీందర్‌గౌడ్(50) అనేవ్యక్తి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. ఉదయం మానేరు తీరానికి వచ్చిన రవీందర్ నీటిలో ఈదుకుంటూ వస్తుండగా అంతలోనే ఫిట్స్ రావడంతో నీటిలో ఊపిరాడక మృతి చెందాడని గ్రామస్థులు తెలిపారు. మృతుడికి భార్య రమ, ఇద్దరు కుమారులున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పొత్కపల్లి ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

రహదారిపై కొండ చిలువ

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం శివారులోని ఓ ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాల సమీపంలో కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై ఆదివారం రాత్రి కొండ చిలువ ప్రత్యక్షమైంది. రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్ వద్ద నుంచి వెళుతోంది. గమనించిన వాహనదారులు ఆగి హతమార్చేందుకు యత్నించారు. రాళ్లతో కొట్టడడంతో కొండచిలువ తప్పించుకుని పక్కనే ఉన్న వ్యవసాయ పొలాల్లోకి వెళ్లింది.


రోడ్డు పక్కనుంచి వెళుతున్న కొండచిలువ

కాలనీలో వ్యక్తి ఆత్మహత్య

ఫైవింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని టుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీలంక షిర్కే ప్రాంతానికి చెందిన పెనుగొండ కుమార్ (38) ఆదివారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సమస్యల కారణంతో ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని స్థానికులు భావిస్తున్నారు. గోదావరిఖని టుటౌన్‌సీఐ ప్రసాద్‌రావు మృతదేహాన్ని ప్రభుత్వఏరియా ఆసుపత్రికి తరలించారు.

రైతును కాటేసిన నాగుపాము

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచర్లబొప్పాపూర్‌లో ఆదివారం రైతు సత్తయ్యను నాగుపాము కాటేసింది. స్థానికుల కథనం ప్రకారం.. సత్తయ్య రోజులాగే వ్యవసాయక్షేత్రానికి వెళ్లాడు. పొలంలో తిరుగుతుండగా అతన్ని పాము కరిచింది. వెంటనే అతన్ని తోటి రైతులు మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారని ప్రస్తుతం సత్తయ్య ఆరోగ్యం నిలకడగా ఉందని వారు స్పష్టం చేశారు.

నీటి ట్యాంక్‌లో పడి ఇద్దరు చిన్నారుల మృతి

● బొమ్మకల్ సిమెంట్ పైపుల ఫ్యాక్టరీలో ఘటన


చిన్నారుల మృతదేహాలు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): అల్లారుముద్దుగా ఉన్న ఇద్దరు చిన్నారులు ఇంటి బయట ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు నీటి ట్యాంక్‌లో పడి మృతి చెందారు. కరీంనగర్ శివారులోని బొమ్మకల్‌లో చోటు చేసుకున్న సంఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. కరీంనగర్ రూరల్‌సీఐ, స్థానికుల వివరాల ప్రకారం... కరీంనగర్ శివారులోని బొమ్మకల్ రోడ్‌లో ఉన్న సత్యం సిమెంట్‌పైపుల ఫ్యాక్టరీలో బీహార్‌కు చెందిన సహానీ బిట్టుకుమార్, అతడి భార్య సుధాదేవి ఐదేళ్ల నుంచి కూలీలుగా పని చేస్తున్నారు. ఇద్దరు కొడుకులు, కూతరుతో ఫ్యాక్టరీ ఆవరణలోని షెడ్డులో నివాసం ఉంటున్నారు. ఆదివారం సాయంత్రం 4 గంటల సమయంలో బిట్టుకుమార్‌మార్కెట్‌కు వెళ్లాడు. భార్య సుధాదేవి ఇంట్లో పనిచేసుకుంటూ ఉంది. కూతురు కూడా ఇంట్లోనే ఉండగా ఇద్దరు కుమారులు సత్యం కుమార్(4), ఆర్యన్‌కుమార్(2) బయట ఆడుకుంటున్నారు. కొంతసేపటికి తల్లి సుధాదేవి బయటకు వచ్చి చూడగా వారు కనిపించలేదు. దీంతో ఫ్యాక్టరీ అవరణలో చూడగా పైపులు క్యూరింగ్ చేసేందుకు ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్‌లో ఆర్యన్‌కుమార్ మృతదేహం నీటిపై తేలి కనిపించింది. దీంతో ఫ్యాక్టరీలోని కూలీలకు విషయం తెలుపగా అర్యన్‌కుమార్‌ను బయటకు తీశారు. నీటిలోపల వెతకగా సత్యంకుమార్ మృతదేహం కూడా లభ్యమైంది. సమాచారం అందుకున్న కరీంనగర్ రూరల్‌సీఐ నిరంజన్‌రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. చిన్నారుల మృతదేహాలను కరీంనగర్ ప్రభుత్వఆసుపత్రి మార్చురీ గదిలోభద్రపరిచారు. తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సెలవురోజు కాకపోతే కాపాడేవారేమో..

ఆదివారం సెలవుదినం కాబట్టి ఫ్యాక్టరీలో పనులు బంద్ చేయడంతో ఆవరణలో కూలీలు ఎవరూ లేరు. కొందరు వారివారి గదుల్లో ఉండగా మరికొందరు మార్కెట్, ఇతరపనుల్లో బిజీగా ఉన్నారు. ఇద్దరు చిన్నారులు బయట ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు నీటి ట్యాంక్‌లో పడ్డారు. అక్కడ ఎవరూ లేకపోవడంతో గమనించలేదు. ఫ్యాక్టరీ పనివేళల్లో ఐతేఎవరైనా సిబ్బంది గమనించి కాపాడేవారంటూ కుటుంబ సభ్యులు రోధించారు. కూతురు(6) తనతమ్ముళ్లతోకలిసి ఆడుకున్నా ఈ విషయం వెంటనే తల్లికి తెలిసేదని, తల్లితో ఇంట్లో ఉందని చెబుతున్నారు. ఐదేళ్లుగా ఇదే ఫ్యాక్టరీలో పనిచేస్తున్నామని, ఎప్పుడూ ఇలాంటి ఘటన జరగలేదని కూలీలు వాపోయారు. ఫ్యాక్టరీ ఆవరణలో కూలీలు, వారిపిల్లలు నివాసం ఉంటుండడంతో వాటర్ ట్యాంక్‌తో ప్రమాదాలు జరుగకుండా ఫ్యాక్టరీ యాజమాన్యం భద్రతాచర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. వాటర్ ట్యాంక్ వద్దకు ఎవరూ వెళ్లకుండా ఏర్పాట్లు చేయకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగిందనే విమర్శలు వస్తున్నాయి. ముఖ్యంగా చిన్న పిల్లలు ఉన్న చోట తగినజాగ్రత్తలు తీసుకుంటే ఇటువంటి ఘటనలు జరిగేందుకు ఆస్కారం ఉండదని, ఇప్పటికైనా ఇటువంటి ప్రమాదకరమైన స్థలాలకు చిన్నారులను దూరంగా ఉంచేలా చర్యలు అధికారులు తీసుకోవాలని ప్రజలు కోతున్నారు.

పోలీసులు కొట్టారని సెల్‌టవర్ ఎక్కి నిరసన

● బాధితుడికి కౌన్సెలింగ్ నిర్వహించిన పోలీసులు


కౌన్సెలింగ్ ఇచ్చేందుకు శ్రీనివాస్‌ను తీసుకెళ్తున్న పోలీసులు

హుజూరాబాద్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పోలీసులు తనను కొట్టారని నిరసిస్తూ హుజూరాబాద్‌లో ఆదివారం సెల్‌టవర్ ఎక్కి నిరసన వ్యక్తం చేసిన సంఘటన చోటుచేసుకుంది. వివరాలుఇలా ఉన్నాయి.. హుజూరాబాద్ పట్టణంలోని మామిండ్లవాడకు చెందిన శ్రీనివాస్ దళిత బంధు పథకం కింద డిజే సౌండ్స్‌ను కొనుగోలు చేసి వ్యాపారం చేసుకుంటున్నాడు. దుర్గామాత నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శనివారం రాత్రి దుర్గామాత విగ్రహాన్ని డీజేతో ఊరేగింపుగా తీసుకెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో శ్రీనివాస్, పోలీసుల మధ్య మాటమాట పెరగడంతో, డిజే సౌండ్స్‌ను సీజ్‌చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో పోలీసులు తనపై చేయి చేసుకున్నారని మనస్తాపానికి గురైన శ్రీనివాస్ సెల్‌టవర్ ఎక్కి నిరసన వ్యక్తం చేశాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు, కుటుంబసభ్యులు సెల్‌టవర్ దిగాలని విజ్ఞప్తి చేశారు. పోలీ సులు వచ్చి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో శ్రీనివాస్ టవర్ దిగాడు. టౌన్ సీఐ కరుణాకర్ శ్రీనివాస్‌కు కౌన్సెలింగ్ నిర్వహించి, మరోసారి ఇలా చేయవద్దని హెచ్చరించారు. అనంతరం సీఐ కరుణాకర్ మాట్లాడుతూ ఉత్సవాల సందర్భంగా డీజేలు పెట్టరాదన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో ఆదివారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి(45) మరణించినట్లు కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. మృతుడు తెలుపు షర్ట్, బ్లూకలర్ జీన్స్‌పాయింట్ ధరించి ఉన్నాడని పేర్కొన్నారు. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రిలోని మార్చురీగదిలో భద్రపరిచినట్లు తెలిపారు. గుర్తించి నవారు వెంటనే వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక


పతకాలతో విద్యార్థులు

కోరుట్ల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాలకు చెందిన తైక్వాండో కరాటే విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు మాస్టర్ రమేష్ ఆదివారం తెలిపారు. ఈ నెల 20వ తేదిన జగిత్యాల జిల్లా కేంద్రంలోని తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాలకు చెందిన విద్యార్థులు పాల్గొని వివిధ విభాగాల్లో రాణించినట్లు తెలిపారు. తైకాండో క్లబ్ కరాటే శిక్షణ పొందిన విద్యార్థులు అండర్-14, అండర్-17 కేటగిరి వివిధ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో 20 మంది విద్యార్థులు పాల్గొన్నట్టు తెలిపారు. ఇద్దరు గోల్డ్ మెడల్, ఆరుగురు సిల్వర్ మెడల్స్ సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి చక్రధర్‌రావు మెడల్స్‌ను అందించి అభినందించారు. విద్యార్థులను తైక్వాండో అసోషియేషన్ సభ్యులు సంతోష్ కుమార్, గంగారావు, నావనంది రమేష్ అభినందించి సన్మానించారు.



దొంగలున్నారు జాగ్రత్త

- ఇంటికి తాళం కనపడిందో... తెల్లవారేసరికి సొమ్ములు చోరీ
- విలువైన బంగారం, డబ్బులు ఇళ్లలో పెట్టవద్దని పోలీసుల సూచన

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): దసరా సెలవులంటే పిల్లలతోపాటు తల్లిదండ్రులకు ఉత్సాహంగా ఉంటుంది. స్వగ్రామాలు, పల్లెటూళ్లకు వెళ్లడం, విహారయాత్రలు లాంటివి ప్లాన్ చేసుకుంటారు. ఇవే సెలవులు దొంగలకు నెలవుగా మారుతున్నాయి. పట్టణాల్లో నివాసం ఉంటున్న చాలా కుటుంబాలు సెలవుల్లో ఇళ్లకు తాళం వేసి ఇతర ప్రాంతాలకు వెళుతుంటారు. దీనిని దొంగలు అవకాశంగా మలుచు కుంటారు. కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ వ్యాప్తంగా తాళం వేసిన ఇళ్లల్లో దొంగతనాలు ఇటీవలి కాలంలో ఎక్కువగా జరుగుతున్నాయి.

పగటిపూట రెక్కీ.. రాత్రి వేళ చోరీ

తాళంవేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుంటున్న దొంగలు నగదుతోపాటు బంగారం, వెండి, వాహనాలు, ఇతర విలువైన వస్తువులను ఎత్తుకుపోతున్నారు. పగటి పూట రెక్కీ నిర్వహిస్తూ వారు టార్గెట్‌గా చేసుకున్న ఇళ్ల వద్ద పరిసరాలను పూర్తిగా అవగాహన చేసుకుంటారు. తాళం వేసిన ఇళ్లను గూగుల్ మ్యాప్‌లో లొకేషన్ పిన్ చేసుకుని అర్థ రాత్రి సమయాల్లో చోరీలకు పాల్పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పగటి పూటనే రైతులు ఇళ్లకు తాళం వేసి వ్యవసాయ పనులకు వెళుతున్న సమయంలో అదనుచూసి లూటీ చేస్తున్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి..: గౌస్ ఆలం, సీపీ



దసరా, బతుకమ్మ పండుగల సందర్భంగా ప్రజలు తమ ఇళ్లకు తాళాలు వేసి స్వగ్రామాలకు వెళతారు. ఈ సమయంలో చోరీలను నివారించడానికి పోలీస్ శాఖ తరుపున పటిష్ఠమైన చర్యలు తీసుకుంటున్నాము. పండుగకు వెళ్లే ప్రజలు దొంగల బారిన పడకుండా ఉండడానిక్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ఎవరైనా అనుమానితులు కనిపిస్తే డయల్ 100కు, బ్లూకోల్ట్స్ సిబ్బందికి, సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలి.

24 గంటల గస్తీ ఉన్నా..

ఒక వైపు బ్లూకోల్ట్స్ పోలీసులు గస్తీ నిర్వహిస్తుండగానే మరో వైపు దొంగలు చోరీలకు పాల్పడుతుండటం ఆందోళనను కలిగిస్తున్నది. దొంగతనాలు జరిగిన తరువాత పోలీసులు కేసు, విచారణ చేపట్టి సీసీ కెమెరాల ఆధారంగా, వేలి ముద్రల ఆధారంగా దొంగలను అరెస్టు చేస్తున్నప్పటికీ బాధితుల సొమ్ములు పూర్తిగా రికవరీ కావడం లేదు. జన సమర్థ ప్రాంతాలు, శివారు కాలనీ కానీ.. ఏ మూలలో అయినా ఇంటికి తాళం కనపడితే చాలు.. దొంగలు రెచ్చిపోయి ఇంటిలోని విలువైన బంగారం, నగదును అపహరించుకుపోతున్నారు. ఇళ్లకు వేసిన తాళాలు అలాగే ఉండగా గొళ్లాలను చాకచక్యంగా తొలగిస్తున్నారు. దొంగతనం జరిగిన ప్రదేశాల్లో వేలి ముద్రలు పోలీసులకు చిక్కకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ముఖానికి మాస్క్‌లు, వాహనాలకు నంబర్ ప్లేట్లు తొలగించి చోరీలకు పాల్పడుతతున్నారు. ప్రజలు కూడా స్వరైన భద్రతా చర్యలు తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.

దొంగతనాల నియంత్రణకు కొన్ని ముఖ్యమైన జాగ్రత్తలు...

- ఊరెళ్లే ముందు సమీప పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలి. పెట్రోలింగ్ బృందాలు ఆ ఇంటిపై ప్రత్యేక నిఘా పెడతాయి.
- ఇంటిని గమనిస్తూ ఉండండని ఇరుగుపొరుగు వారికి చెప్పండి. ఇంటికి సంబంధించిన ఏవైనా అనుమానాస్పద విషయాలు ఉంటే వెంటనే తెలియజేయమని చెప్పండి.
- ఊరెళ్లేటప్పుడు ఇంట్లో డబ్బు, బంగారం ఉంచకుండా వాటిని బ్యాంకు లాకర్‌లో భద్రపరచండి. బీరువా తాళాలను ఇంట్లో పెట్టకుండా వెంట తీసుకెళ్లండి.
- ఊరెళ్తున్నట్లు సోషల్ మీడియాలో, వాట్సాప్ స్టేటస్‌లలో పెట్టవద్దు. ఇది నేరగాళ్లకు ఇల్లు ఖాళీగా ఉందని తెలియజేస్తుంది.
- ఇంటికి తాళం వేసినప్పుడు, ఇంట్లోని ఏదో ఒక గదిలో లైటు వేసి ఉంచడం మంచిది. తాళం బయటకు కనిపించకుండా డోర్ కర్టెన్ వేయాలి.
- కాలనీల్లో, ఇంటి పరిసరాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం వల్ల దొంగతనాలను నివారించవచ్చు. ఈ విషయంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, వ్యాపారులు సహకరించాలి.
- ఉదయం పూట పూల మొక్కలు, ఇతర వస్తువులు అమ్మేవారి రూపంలో లేదా రాత్రి వేళల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తులపై నిఘా ఉంచాలి. అనుమానితుల గురించి వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.
- పండుగ సందర్భంగా వచ్చే ఆన్‌లైన్ షాపింగ్ ఆఫర్లపై అప్రమత్తంగా ఉండాలి. నకిలీ ఐడీలు సృష్టించి మోసాలు చేసే అవకాశం ఉంది.
- అనవసరంగా వచ్చే మెసేజ్‌లలోని బ్లూ కలర్ లింకులను ఓపెన్ చేయవద్దు. లాటరీ తగిలిందని, గిఫ్ట్ వచ్చిందని, తక్కువ ధరకు వస్తువులు ఇస్తామని వచ్చే సందేశాలను నమ్మవద్దు.
- సైబర్ నేరానికి గురై డబ్బులు పోగొట్టుకుంటే, 24 గంటలలోపు ఫిర్యాదు చేస్తే డబ్బులు రికవరీ అయ్యే అవకాశం ఉంది.
- సైబర్ నేరాల ఫిర్యాదు కోసం 1930 (జాతీయ హెల్ప్‌లైన్), 112, 100
- ఆన్‌లైన్ ఫిర్యాదు www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో చేయాలి.



మాజీ కలెక్టర్ కేఎస్ శర్మ మృతి

- ఉమ్మడి జిల్లాతో విడదీయరాని అనుబంధం



కేఎస్ శర్మ(ఫైల్)

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడిజిల్లాకు కలెక్టర్‌గా సేవలందించిన కేఎస్ శర్మ(కంభం పాటి సుబ్రహ్మణ్య శర్మ) (80) ఆదివారం అనారోగ్యంతో హైదరాబాద్‌లో మృతిచెందారు. నిజాయితీ, నిబద్ధత గల ఉత్తమ అధికారిగా గుర్తింపు పొందిన ఆయనకు ఉమ్మడి జిల్లాతో విడదీయ రాని అనుబంధం ఉంది.. ఆయన మృతితో కవులు, కళాకారులు, నగర వాసులు, ప్రత్యక్షంగా చూసినవారు గతస్మృతులను నెమరు వేసుకున్నారు. ఆయన హయాంలో కరీంనగర్‌లో త్యాగరాజ లలిత కళాపరిషత్, జవహర్ బాలకేంద్రం, టీఎల్ కే ఓపెన్ ఆడిటోరియం ఏర్పాటుచేశారు. నెహ్రూ యువకేంద్ర బలోపేతానికి కృషిచేశారు. అనేక సంక్షేమ కార్యక్రమాలకు నాంది పలికిన ఆయన ఫిలింభవన్‌తోపాటు అనేకసంస్థలకు స్థలాలు మంజూరు చేశారు. సోమవారం ఆయన అంత్యక్రియలు జరుపనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శర్మ మృతికి పలువురు కవులు, కళాకారులు, సాహితీ కళాసంస్థల బాధ్యులు, నగరవాసులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

సెరికల్చర్‌లో రాజన్న సిరిసిల్లకు జాతీయస్థాయి అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ మల్లికార్జున

సిరిసిల్ల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సెరికల్చర్ అభివృద్ధిలో రాజన్న సిరిసిల్ల జిల్లాజాతీయస్థాయి అవార్డును సాధించింది. జిల్లాలోని రైతులకు సెరికల్చర్‌లో పట్టుపురుగుల సాగుకు సంబంధించిన అవగాహన కల్పించడం, సాగు పద్ధతుల్లో శిక్షణ ఇవ్వడంలో జిల్లాను ముందు వరుసలో సెరికల్చర్ సైంటిస్ట్ డాక్టర్ మల్లికార్జున, అసిస్టెంట్ సెరికల్చర్ అధికారి జగన్‌రావులు కృషిచేశారు. ఇందుకు సిల్క్‌బోర్డునుంచి అవార్డులు అందుకున్నారు. జిల్లాసమన్వయకర్తలుగా గ్రామీణ ప్రాంతాల్లో విజయవంతంగా ప్రచార కార్యక్రమాలు, సమావేశాలు సాంకేతిక ప్రదర్శనలు ఇస్తూ రైతులకు అవగాహన కల్పించినందుకు జిల్లాకు అవార్డులు లభించాయి. ఆదివారం బెంగళూరులోని సెంట్రల్ సిల్క్‌బోర్డు ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో అదనపు డైరెక్టర్ డైరెక్టర్ లత, సైంటిస్ట్ డాక్టర్ మల్లికార్జున అవార్డులు అందుకున్నారు.

బీడీ పరిశ్రమను జీఎస్టీ నుంచి మినహాయించాలి



మాట్లాడుతున్న బీడీ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు

కోరుట్ల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ నుంచి బీడీ పరిశ్రమను మినహాయించాలని తెలంగాణ ప్రగతిశీల బీడీవర్కర్స్ యూనియన్ సభ్యులు కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. ఆదివారం కోరుట్ల పట్టణంలోని బీడీవర్కర్ యూనియన్ భవనంలో కరీంగనగర్, జగిత్యాల, కామారెడ్డి, రాజన్నసిరిసిల్ల, నిర్మల్, మంచిర్యాల జిల్లాల ప్రతినిధుల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ బీడీ కార్మికులకు ఆంక్షలులేకుండా పెన్షన్‌కింద జీవనభృతి4000 రూపాయలు చెల్లించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జీఎస్టీపై బీడీపరిశ్రమను మినహాయించే విధంగా తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని డిమాండ్ చేశారు. వచ్చే జనరల్‌కౌన్సిల్ సమావేశం అక్టోబరు20వ తేదీన నిజామాబాద్ జిల్లాకేంద్రంలో నిర్వహిస్తామని జిల్లా ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్రఅధ్యక్షుడు చింతభూమేశ్వర్, కార్యదర్శి సూర్యశివాజీ, వర్కింగ్ ప్రెసిడెంట్ హరిత, భారతి రాష్ట్రకమిటీ సభ్యులు గంగాధర్, అరుణ, శివకుమార్, భూమయ్య పాల్గొన్నారు.

ధర్మపురిలో శేషప్ప కళావేదికపై మహా సత్సంగ్



మహా సత్సంగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న భక్తులు

ధర్మపురి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయ ఆవరణలో గల శేషప్ప కళావేదికపై ధర్మపురి ప్రఖండ ఆధ్వర్యంలో ఎనిమిది సత్సంగాలను కలుపుతూ మహా సత్సంగ్ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా భాగ్యనగర్ క్షేత్ర సత్సంగ్ ప్రముఖ్ శాలివాహన పండరినాథ్ మాట్లాడుతూ సత్సంగ్ ద్వారా మనసు, వాక్కు శుద్ధి జరుగుతుందని తెలిపారు. హనుమాన్ చాలీసా పారాయణం 21, 21, 108 సార్లు పఠనం చేయడం ద్వారా ఒక్కో ఫలితం పొందగలమని తులసీదాసు తెలిపారని ఆయన అన్నారు. గ్రామాల్లో ప్రతి దేవాలయ కేంద్రంగా సత్సంగ్ నిర్వహణకు కృషిచేయాలని ఆయన కోరారు. రామలింగేశ్వరస్వామి ఆలయంలో సత్సంగ్ మొదటి వార్షికోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో వేదపండితులు పురుషోత్తమాచార్యులు, పూర్వపర్తి సమయ కార్యకర్త జయప్రద, సామాజిక సమరసత టోలి సభ్యులు అల్లం దుర్గప్రసాద్, జిల్లాకార్యదర్శి కస్తూరిరాజన్న, ముత్యపు రమేష్, మామిడాల రవీందర్, వెలగందుల బుచ్చన్న, వెలగందుల రవి తదితరులు పాల్గొన్నారు.

వేములవాడలో ఎంగిలి పూల వైభవం

- రాజన్న ఆలయంలో ఆకట్టుకున్న బతుకమ్మ, దాండియా ఆటలు

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఒక్కేసి పువ్వేసి చందమామ.. ఒక్క జాములాయే చందమామ... అంటూ మహిళలు, యువతులు ఎంగిలి పూల బతుకమ్మను వేములవాడ పట్టణం, రాజన్న ఆలయంతో పాటు పల్లెల్లో ఎంతో వైభవంగా చేపట్టారు. మహిళలు, యువతులు, చిన్నారులు సాంప్రదాయ దుస్తుల్లో తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చుకుని కూడళ్ల వద్ద బతుకమ్మలను పెట్టి తెలంగాణ సంప్రదాయ పాటలతో ఆటలాడుతూ సంబరాలు జరుపుకున్నారు. ఎంగిలి పూల తొలిరోజు బతుకమ్మ సందర్భంగా మండలంలోని ఆరెపల్లి, సంకెపల్లి, గొల్లపల్లి, రుద్రవరం, అనుపురం, నాంపల్లి, కొడుముంజ, శాభాష్‌పల్లి, మారుపాక, చంద్రగిరి, చింతలఠాణ, చీర్లవంచ గ్రామాల్లో వాడవాడన డీజే సౌండ్లతో బతుకమ్మ పాటలు మారుమోగిపోయాయి. మహిళలు బతుకమ్మల చుట్టూ వలయాకారంలో క్రమపద్ధతిలో తిరుగుతూ బతుకమ్మ పాటలు పాడగా, యువతులు బతుకమ్మ పాటలతో కోలాటం ఆడుతూ నృత్యాలు చేశారు. అనంతరం గ్రామ శివారులోని చెరువుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.



రాజన్న ఆలయంలో దాండియా ఆడుతున్న యువతులు, మహిళలు

రాజన్న ఆలయంలో..

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో ఆదివారం ఎంగిలి పూల బతుకమ్మలు కన్నుల పండువగా జరిగాయి. పట్టణంలోని మహిళలు బతుకమ్మలతో రాజన్న ఆలయానికి తరలివచ్చి ఆలయంలో బతుకమ్మలను నిలిపి బతుకమ్మ పాటలు పాడుతూ ఆటలు ఆడారు. డీజే సౌండ్ మధ్య యువతులు ఆడిన దాండియా ఆటలు, మహిళలు ఆడిన కోలాటాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం రాజన్న ఆలయ ధర్మగుండంలో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. వెంట తీసుకువెళ్లిన ఫలహారాన్ని ఇచ్చిపుచ్చుకున్నారు.



రాజన్న ఆలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

రసాయన శాస్త్ర విభాగంలో మంజులకు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న మంజుల

గణేశ్‌నగర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం రసాయనశాస్త్ర విభాగంలో పరిశోధక విద్యార్థి తిరుకోవెల మంజులకు పరీక్షల నియంత్రణ విభాగం డాక్టరేట్ ప్రదానం చేసింది. 'సింథసిస్ ఆఫ్ పైరాన్ అండ్ పైపిరిడిన్ డెరివేటివ్స్ యూసింగ్ నావెల్ మెథడాలజీస్' అనే అంశంపై డాక్టర్ జయంతి పర్యవేక్షణలో పరిశోధన చేశారు. మంజుల ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల రసాయన శాస్త్ర విభాగంలో అధ్యాపకురాలిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె వీసీ ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్‌కు, రిజిస్ట్రార్ ఆచార్య రవికుమార్ జాస్తీ, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ డి.సురేష్ కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. రమాకాంత్, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ వి.నమ్రత, బోర్డ్‌ఆఫ్ స్టడీస్ చైర్ పర్సన్ డాక్టర్ ఎం.సరసిజకు కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీరాంసాగర్‌కు తగ్గిన వరద

- 23 గేట్ల ద్వారా....73,540 క్యూసెక్కులు దిగువకు



దిగువకు దూకుతున్న శ్రీరాంసాగర్ నీరు

జగిత్యాల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌కు ఆదివారం వరద నీరు తగ్గింది. 23 గేట్లు పైకి ఎత్తి 73,540 క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 95,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.053 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి తిరిగి ప్రారంభమైన ఎత్తిపోతలు

ఇల్లంతకుంట: మండలంలోని అనంతగిరి గ్రామ సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి ఒక పంపుద్వారా తిరిగి నీటి ఎత్తిపోతలు ఆదివారం ప్రారంభం అయ్యాయి. 3.5టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 3.26టీఎంసీల నీరు ఉంది. మధ్యమానేరు ద్వారా వచ్చిన 3200క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తుండగా ఎగువన ఉన్న రంగనాయకసాగర్‌కు 3300క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

బోయినపల్లి: శ్రీ రాజరాజేశ్వర జలాశయానికి(మిడ్ మానేరు) ప్రాజెక్టుకు ఆదివారం 6300క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా 4500మానేరు, ములవాగు ద్వారా 1800 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది. దిగువకు మూడు గేట్ల ద్వారా 5500 క్యూసెక్కులు ప్యాకేజీ 9లోని మల్కపేట రిజర్వాయర్‌కు క్యూసెక్కులు, ప్యాకేజీ 10లోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 3200 నీటిని తరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318 మీటర్లకు ప్రస్తుతం317.89 ఉండగా, సామర్థ్యం 27.55 టీఎంసీలకు 27.273 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

ఎల్ఎండీ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

తిమ్మాపూర్ : దిగువ మానేరు జలాశయం నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. ఎల్ఎండీ పూర్తిస్థాయి నీటిమట్టం 24.034టీఎంసీలు కాగా ప్రస్తుతం 23.645టీఎంసీల నీరునిల్వ ఉంది. మోయతుమ్మెద వాగు నుంచి 5909క్యూసెక్కులు, మిడ్‌మానేరు నుంచి 5500 క్యూసెక్కులు, ఎగువ కాకతీయకాలువ నుంచి 200క్యూసెక్కులు మొత్తం 11,609క్యూసెక్కులు ఎల్ఎండీలోకి ఇన్‌ఫ్లో వస్తోంది. నాలుగు గేట్ల నుంచి 8వేల క్యూసెక్కులు, కాకతీయ కాలువ నుంచి 4500క్యూసెక్కులు, మిషన్‌భగీరథ, ఆవిరిరూపంలో 309క్యూసెక్కులు మొత్తం 12,809క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో వెలుతోంది.

బీఆర్ఎస్ హయాంలో ప్రజలకు చేసిందేమీ లేదు

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజలకు చేసిందేమీ లేదని రాష్ట్ర ఎస్సీఎస్టీమైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో మంత్రిగా ఉన్న కొప్పుల ఈశ్వర్ నియోజకవర్గంలో సాధించిందేమీ లేదని, తననోటికి వచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని ఆయన హెచ్చరించారు. 2014 నుంచి 2023 వరకు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని ఆయన అన్నారు. కాంగ్రెస్ అధికారం చేపట్టిన అనంతరం ఇచ్చిన హామీలను నెరవేర్చుతున్నట్లు ఆయన గుర్తుచేశారు. ఆరు గ్యారెంటీల్లో నాలుగు అమలు చేసి ఎంత కష్టమైన మరోరెండు గ్యారెంటీ పథకాలను ఇచ్చి తీరుతామని ఆయన తెలిపారు. ప్రతీ గ్రామంలో పేద వారికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేసి వారంవారం లబ్ధిదారులకు డబ్బులు చెల్లిస్తున్నామని ఆయన అన్నారు.



మాట్లాడుతున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ఇందిరమ్మ ఇళ్లు కట్టలేదని ఆరోపించిన కొప్పుల ఈశ్వర్ ఇంటి ప్రారంభోత్సవానికి పిలిస్తే వస్తారా అని ఆయన ప్రశ్నించారు. చెగ్యాం ముంపు బాధితులకు నష్టపరిహారం ఇప్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని ఆయన అన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు నుండి నీరు సిద్దిపేటకు తరలించుకపోతుంటే కొప్పులఈశ్వర్ నియో జకవర్గానికి ఏమి చేశారో చెప్పాలని ఆయన సవాల్ విసిరారు. అధికారం కోల్పోయి అక్కసుతో కొప్పుల ఈశ్వర్ ఆరోపణలు మానుకోవాలని ఆయన సూచించారు. యూరియా కొరత దేశమంతా ఉందని ఇందుకు కేంద్ర ప్రభుత్వమే కారణమని ఆయన పేర్కొన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ఎంపీలు యూరియా కొరత గురించి సంబంధిత మంత్రులను కోరలేదని, కాంగ్రెస్ ఎంపీలు మాత్రమే యూరియా అందించాలని కోరడం జరిగిందని ఆయన అన్నారు.

బీఆర్ఎస్‌లో చాలామంది నాయకులు తమతో టచ్‌లో ఉన్నారని తాము గేట్లు తెరిస్తే మీపక్కన ఎవరు కూడా మిగలరని ఆయన తెలిపారు. ధర్మపురి పట్టణంలో త్వరలో డిగ్రీకళాశాల ఏర్పాటు చేస్తామని తెలిపారు. సమావేశంలో ధర్మపురి ఆలయ ధర్మకర్తల మండలిచైర్మన్ జక్కు రవీందర్, టీపీసీసీసభ్యుడు, కాంగ్రెస్‌మండల అధ్యక్షుడు సంగనభట్ల దినేష్, ఉపాధ్యక్షుడు వేముల రాజేష్, పట్టణకాంగ్రెస్ అధ్యక్షుడు చీపిరిశెట్టిరాజేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కుంట సుధాకర్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అప్పం తిరుపతి, ధర్మారం ఏఎంసీ చైర్మన్ రాప్లానాయక్, జిల్లాకాంగ్రెస్ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు చిలుముల లక్ష్మణ్, ఏఎంసీ వైస్‌చైర్మన్ సంగ నర్సింహులు, ప్రదీప్‌రెడ్డి, జంగిలి ప్రభాకర్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సౌదీలో అనారోగ్యంతో తక్కళ్లపల్లి వాసి మృతి

కథలాపూర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తక్కళ్లపల్లికి చెందిన సంగ మల్లయ్య(59) అనే గల్ఫ్ వలసజీవి అనారో గ్యంతో సౌదీలో రెండురోజుల కిందట మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలి పిన వివరాల ప్రకారం.. మల్లయ్య 25 సంవ త్సరాలుగా సౌదీలో ఓ అరబ్ షేక్ ఇంట్లో తోట మాలిగా పనిచేస్తున్నాడు. అయితే ఈ మధ్య మెడుకు సంబంధించిన సమస్యతో ఇబ్బందులు పడుతుండగా ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నాడు. ఆ సమస్య తీవ్రం కావడంతో మృతిచెందాడు. మృతుడికి కొడుకు, కూతురు ఉన్నారు. తండ్రి మృతి చెందిన విషయం తెలుసుకున్న కొడుకు దుబాయి నుంచి స్వగ్రామం చేరుకున్నాడు. కాగా మృతదేహాన్ని స్వగ్రామానికి పంపించేలా చూడాలని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను మాజీ సర్పంచ్ అల్లకొండ లింగం గౌడ్ కోరగా ఎంబసీ అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడారు. అంబులెన్స్ వసతి ఉచితంగా కల్పిస్తానని అదేవిధంగా గల్ఫ్ పాలసీలో భాగంగా అందించే ఐదు లక్షల రూపాయలు ఇప్పిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్టు లింగంగౌడ్ తెలిపారు.



మల్లయ్య(ఫైల్)

ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ



వీణవంక మండలం నర్సింగాపూర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



మానకొండూర్‌లో..

మానకొండూర్/ సైదాపూర్/ వీణవంక/ గంగాధర/ రామడుగు/ ఇల్లందకుంట/ హుజూరాబాద్/శంకరపట్నం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లో ఆదివారం ఎంగిళి పూల బతుకమ్మను మహిళలు, యువతులు ఘనంగా జరుపుకున్నారు. ఉదయమే యువతులు రంగురంగుల పూలు తీసుక వచ్చి భక్తి శ్రద్ధలతో బతుకమ్మలు పేర్చి పసుపుతో గౌరమ్మను చేసి బతుకమ్మపై పెట్టి పూజలు నిర్వహించి ఫలహారాలను నైవేద్యంగా పెట్టారు. సాయంత్రం అయా గ్రామాల్లోని ఆల యాల వద్ద బతుకమ్మలు పెట్టి మహిళలు, యువతులు, చిన్నారులు బతుకమ్మల చుట్టూ తిరుగుతూ చప్పట్లు కొడుతూ ఆడి పాడారు. కోలాటం ఆడారు. అనంతరం సమీప చెరువుల్లో నిమజ్జనం చేశారు. వాయనాలు ఇచ్చిపుచ్చుకున్నారు. ఇలా తొమ్మిది రోజుల పాటు ప్రధాన కూడళ్లలో బతుకమ్మలను పెట్టి ఆటపాటలతో మహిళలు హోరెత్తించనున్నారు. రామడుగు మండలంలోని రుద్రారం గీతాంజలి మోడల్‌స్కూల్‌లో జరిగిన బతుకమ్మ సంబరాల్లో ప్రధానోపాధ్యాయుడు గుర్రం రాజశేఖర్, మాజీఎంపీటీసీ గుర్రం దేవిక, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కరీంనగర్ రూరల్: కరీంనగర్ రూరల్ పరిధిలోని గ్రామాల్లో ఆదివారం చిన్న బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. మహిళలు, యువతులు, చిన్నారులు ఉదయం నుంచే రంగురంగుల పూలతో వివిధ ఆకృతుల్లో బతుకమ్మలను పేర్చి బతుకమ్మ ఆడి మురిసిపోయారు. ఆటా పాటలతో, దాండియా నృత్యాలతో, చప్పట్ల మోతలతో బతుకమ్మ ఆడి ఆలయాల్లో, సమీప జలాశయాల్లో నిమజ్జనం చేశారు.

రామ్‌లీలా ఉత్సవాలను జయప్రదం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలోని చింతకుంట ఎస్సారెస్పీ కెనాల్ సమీపంలో దసరా సందర్భంగా మొదటిసారి నిర్వహించనున్న రామ్‌లీలా ఉత్సవాలను విజయవంతం చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పిలుపునిచ్చారు. అక్టోబరు 2న దసరా పండుగ రోజున మంజునాథ యూత్ ఫ్రెండ్స్ గుర్రాల జయ ప్రకాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే రామ్‌లీలా ఉత్సవాల పోస్టర్‌ను క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి, కొత్తపల్లి మండల మాజీ వైస్ ఎంపీపీ భూక్యా తిరుపతినాయక్, మాజీ కార్పొరేటర్ బోనాల శ్రీకాంత్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి రేణిగుంట రాజు, బీఆర్ఎస్ నాయకులు బెజ్జంకి సంపత్, గ్రామ యూత్ అధ్యక్షుడు మణికంఠ గౌడ్ పాల్గొన్నారు.

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

భగత్‌నగర్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): హిందూ మనోభావాలను దెబ్బతీసే విధంగా వినాయక విగ్రహాలను చింతకుంట శ్మశాన వాటికలో వేసిన కంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని చింతకుంట గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినాయక నిమజ్జనం సందర్భంగా చింతకుంటలోని ఎస్ఆర్ఎస్పీ కాలువలో వేసిన వినాయక విగ్రహాలను తీసి శ్మశాన వాటికలో వేశారన్నారు. నగరంలో సేకరించిన చెత్తను సైతం శ్మశాన వాటికలో వేస్తున్నారన్నారు. చింతకుంటకు చెందిన భూక్య తిరుపతి నాయక్, గుర్రాల జయప్రకాశ్‌రెడ్డి, కమల్‌గౌడ్, విజయ్, శ్యాం, వెంకటచారి, సాగర్‌రెడ్డి, సందీప్ ఉన్నారు.

రాష్ట్రస్థాయి కరాటేలో అల్ఫోర్స్ విద్యార్థిని ప్రతిభ



అభినందిస్తున్న అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి అండర్-14 కరాటే పోటీల్లో వావిలాల పల్లి అల్ఫోర్స్ బాలికల ఈటెక్నో పాఠశాల విద్యార్థిని ఎ.శ్రీహిత రెడ్డి చాంపియన్‌షిప్ సాధించింది. చాంపియన్ కరాటే డు అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటింది. ఈ సందర్భంగా ఆదివారం పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి ఆమెను సన్మానించారు. భవిష్యత్‌లో జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్‌బాపూజీ వర్ధంతి

హుజూరాబాద్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని చేనేత సహకార సంఘం, డిపో క్రాస్ వద్ద కొండా లక్ష్మణ్‌బాపూజీ వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు.

న్యూస్‌బాక్స్..

సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు

సైదాపూర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఫకీర్‌లకు మోపెడ్(టూవీలర్), మహిళల కోసం ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన పథకాలు అమలు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మైనారిటీశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మొహమ్మద్ ఓబేదుల్ల కొత్వాల్‌కు తెలంగాణ రాష్ట్ర ముస్లిం ఫకీర్ బీసీ ఈ4 సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి శేక్ మాసూద్ అలీ ఒక ప్రకటనలో కృత జ్ఞతలు తెలిపారు. పథకం అమలుకు ప్రభుత్వంతో మాట్లాడి కృషి చేసిన హజ్ కమిటీ చైర్మన్ అల్‌హాజ్ ఖుస్రూ పాషా బియాబాని సాహెబ్‌కు తమ సంఘం తరుపున ధన్యవాదాలు తెలిపారు.


అన్నప్రసాద వితరణ

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పితృ అమావాస్య సందర్భంగా ఆదివారం గాంధీరోడ్, ఎస్ఆర్ఆర్ కాంప్లెక్స్ చౌరస్తా వద్ద అన్నపూర్ణా సేవాసమితి ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో సభ్యులు కైలాసకిషోర్, గుండ రవి, వేణు, జి.శివ, జగదీశ్, సుభాష్, వెంకటేశం, మహేశ్, విజయ్ పాల్గొన్నారు.

పెన్షన్ పెంపు పోరాటానికి సంపూర్ణ మద్దతు

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మందకృష్ణ మాదిగ నాయకత్వంలో జరుగుతున్న వికలాంగుల పెన్షన్ పెంపు పోరాటానికి సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు మాజీ కార్పొరేటర్, బీఆర్ఎస్ నాయకుడు కంసాల శ్రీనివాస్ ప్రకటించారు. ఆదివారం కంసాల శ్రీనివాస్‌ను ఆయన నివాసంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు కలిశారు. తమ పోరాటానికి మద్దతు ఇవ్వా లని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభు త్వం వెంటనే ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంజయ్య మాదిగ, వరలక్ష్మి మాదిగ, రాజు, రత్నాకర్, పర్శరాం పాల్గొన్నారు.

నేటి నుంచి నవరాత్రోత్సవాలు



దుర్గా భవానీ అమ్మవారు

కరీంనగర్ రూరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): త్రిమూర్తులకు శక్తి ప్రదాత, త్రిలోకేశ్వరి సకలాభిష్ట ప్రదాయిని దుర్గా భవానీ శరన్నవరాత్రోత్సవాలు కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ దుర్గా భవానీ ఆలయంలో సోమవారం నుంచి ప్రారంభం కానున్నట్లు ఫౌండర్ చైర్మన్ వంగల లక్ష్మణ్ తెలిపారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారు వివిధ అలంకరణల్లో దర్శనమివ్వనున్నట్లు చెప్పారు. 2వ తేదీన దసరా వేడుకలు ఉంటాయని పేర్కొన్నారు. ఆలయ కమిటీ బాధ్యులు వేములవాడ ద్రోణాచారి, నీరుమల్ల తిరుపతి, రాచల్ల ప్రసాద్, పల్లెర్ల శ్రీనివాస్, తొడుపునూరి వేణుగోపాల్, చారమల్ల రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్ కల్చరల్: నగరంలోని యజ్ఞవరాహక్షేత్రంలో సోమవారం నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌వీఎస్‌ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యంవరప్రసాద్ ప్రకటనలో తెలిపారు.

షాహిదీ శతాబ్ది నగరకీర్తన యాత్రకు ఆహ్వానం

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నగరంలో నిర్వహించనున్న 350వ షాహిదీ శతాబ్ది నగర కీర్తన యాత్ర-2025కు రావాలని ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌కు సిందూ సమాజ్ సభ్యులు ఆహ్వానపత్రికను అందజేశారు. ఆదివారం క్యాంపుకార్యాలయంలో కరీంనగర్‌కు చెందిన సత్సంగ్ గోవింద్‌నగర్, సింద్ సమాజ్ సభ్యులు ఎమ్మెల్యేను కలిశారు. కార్యక్రమంలో సింద్ సమాజ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆస్ట్రేలియాలో బతుకమ్మ వేడుకలకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆస్ట్రేలియాలో బతుకమ్మ వేడుకల్లో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పాల్గొననున్నారు. తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ క్వీన్స్ లాండ్ ఆధ్వర్యంలో ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్ నగరంలో ఈనెల 27న బతుకమ్మ వేడుకలు నిర్వహించనున్నారు. తెలంగాణ అసోసి యేషన్ సభ్యుల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సోమవారం ఆస్ట్రేలియా బయలు దేరనున్నారు. ఉత్సవాల్లో పాల్గొని తిరిగి 28న స్వదేశానికి తిరిగి రానున్నట్లు నియోజకవర్గ ప్రజాకార్యాలయం ఇన్‌చార్జి నేరెళ్ల పరుశరాములు తెలిపారు.

ఆర్ఎస్ఎస్‌కు వంద సంవత్సరాలు పూర్తి



కార్యక్రమంలో మాట్లాడుతున్న బూర్ల దక్షిణామూర్తి

భగత్‌నగర్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆర్ఎస్ఎస్‌కు వంద సంవత్సరాలు పూర్తయ్యాయని తెలంగాణ ప్రాంత కార్యకారిణి సభ్యుడు బూర్ల దక్షిణామూర్తి తెలిపారు. ఆదివారం నగరంలోని అయోధ్యపురి గణేష్‌నగర్ బస్తీలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నాగపూర్ కేంద్రంగా డాక్టర్ హెగ్డేవార్ 16 మంది బాలలతో ప్రారంభించి 50 శాఖలకు విస్తరించారని, దేశంలో అన్ని ప్రాంతాల్లో ఆర్ఎస్ఎస్‌కు కార్యకలాపాలు ప్రారంభ మయ్యాయని తెలిపారు. ప్రతీ పౌరుడు దేశ బాధ్యతలను తెలుసు కోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా షమ్మీ బంగారం అందించి ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో మానవీయ జిల్లా సంచాలక్ సీఏ నిరంజనాచారి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుడికి బండి సంజయ్ పరామర్శ

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని హౌసింగ్ బోర్డుకాలనీలో బీజేపీ నాయకుడు తోట సాగర్‌ను ఆదివారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ పరామర్శించారు. ఇటీవల సాగర్ అనారోగ్యానికి గురయ్యారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు, స్థానిక నాయకులు ఉన్నారు.

విద్యాసంస్థల్లో బతుకమ్మ వేడుకలు



ట్రినిటి వేడుకల్లో వ్యవస్థాపక చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు విద్యాసంస్థల్లో ఆదివారం నిర్వహించిన బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. స్థానిక తుక్కారావు కాంప్లెక్స్‌లోని ట్రినిటి విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఆదివారం ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. విద్యాసంస్థల వ్యవస్థాపక చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా పూలను భక్తితో కొలిచే సంస్కృతి తెలంగాణలో ప్రత్యేకమన్నారు. రాష్ట్ర ప్రజలతోపాటు విద్యార్థినులు, తల్లిదండ్రులకు, బోధన, బోధనేతర సిబ్బందికి బతుకమ్మ, దసరా, దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విద్యార్థినులు తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మల చుట్టూ తిరుగుతూ ఆటాపాటలతో సందడి చేశారు.

కరీంనగర్ కల్చరల్: జిల్లా కేంద్రంలోని మెహర్‌నగర్ వింధ్యావాలీ ఉన్నత పాఠశాలలో చైర్మన్ రామవరం లక్ష్మీప్రకాశ్‌రావు బతుకమ్మ సంబరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక బతుకమ్మ పండుగ అని అన్నారు. వైస్ చైర్మన్ రామవరం పృథ్వీరావు, ప్రిన్సిపాల్ ప్రశాంత్ పాల్గొన్నారు.

గణేశ్‌నగర్: జిల్లా కేంద్రంలోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్. శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతుకమ్మ తెలంగాణ సంస్కృతీసంప్రదాయాలకు ప్రతిబింబమని కొనియాడారు. అంతకుముందు విద్యార్థినులు బతుకమ్మ ఆడి సందడి చేశారు. ఏసీవో బి. సంపత్ కుమార్, ఏవో బి. శ్రావణ్ కుమార్, కామర్స్ విభాగాధిపతి డాక్టర్ ఆర్. గోపి కృష్ణ, కె. జ్యోతి, కె.కిరణ్ జ్యోతి, ఎస్.శారద, ఎం.రజిత పాల్గొన్నారు.



వింధ్యావాలీ పాఠశాలలో..



వివేకానంద కళాశాలలో..

ఎస్‌యూ కబడ్డీ పోటీల్లో ఎస్సారార్ విద్యార్థుల ప్రతిభ



విజేతలుగా నిలిచిన ఎస్ఆర్ఆర్ కళాశాల విద్యార్థులు

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విద్యార్థులు శాతవాహన యూనివర్సిటీ పరిధిలో నిర్వహించిన యూనివర్సిటీ కబడ్డీ మెన్స్ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచారు. వచ్చే నెల 4 నుంచి 7 వరకు మద్రాసులోని రాణి చెన్నమ్మ యూనివర్సిటీలో నిర్వహించే కబడ్డీ పోటీలకు ఎం.సంజయ్, టి.మధుకర్, ఎ.మధు, జి.రాకేష్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ కల్వకుంట రామకృష్ణ, ఇన్‌చార్జి ఫిజికల్ డైరెక్టర్ నాగేశ్వర్‌రావు, టీజీసీజీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్‌లు నితిన్ పాఠక్, రాజయ్య, అటానమస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ వంగల శ్రీనివాస్, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ తిరుకోవెల శ్రీనివాస్, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ హర్షిత్ కౌర్, స్టాఫ్ క్లబ్ కార్యదర్శి డాక్టర్ మల్లారం శ్రీనివాస్ రెడ్డి, వివిధ విభాగ అధ్యాపకులు అభినందించారు.

ఎక్స్ పో- 2025ను సందర్శించిన ఎమ్మెల్యే



ప్రదర్శనను తిలకిస్తున్న గంగుల కమలాకర్

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మహమ్మద్ ప్రవక్త జన్మదిన మాసం సందర్భంగా జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతీ బాపూలే మైదానంలో ఏర్పాటు చేసిన ఎక్స్‌పో- 2025ను ఆదివారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ సందర్శించారు. ప్రదర్శనలోని అంశాలు, పుస్తకాలు, ప్రవక్త జీవిత విశేషాలపై అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు షోహెబ్ అహ్మద్‌ఖాన్, మాజీ అధ్యక్షుడు మహమ్మద్ ఖైరొద్దీన్, మాజీ కార్పొరేటర్ వాల రమణారావు, మాజీ కో ఆప్షన్ మెంబర్ అంజద్ అలీ, మైనారిటీ నగరశాఖ అధ్యక్షుడు మీర్ షౌకత్ అలీ, షేక్ యూసుఫ్ పాల్గొన్నారు.

రామ్‌లీలా విజయవంతంగా నిర్వహిద్దాం



సుడా చైర్మన్ నరేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న వాకర్స్

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): దసరా సందర్భంగా నగరంలోని మార్క్‌ఫెడ్ గ్రౌండ్‌లో రామ్‌లీలా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిద్దామని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం గ్రౌండ్‌లో మార్నింగ్ వాక్ చేశారు. రామ్‌లీలా ఏర్పాట్లపై మాట్లాడుతూ గత అనుభవాలు తీసుకొని సంబంధిత శాఖల అధికారులతో ముందుకెళ్దా మన్నారు. అనంతరం నరేందర్‌రెడ్డిని వాకర్స్ సన్మానించారు. మాజీ కార్పొరేటర్లు మల్లికార్జున రాజేందర్, బోనాల శ్రీకాంత్, మహేష్, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రమోద్ రావు, గంధం శ్రీనివాస్ గౌడ్, హరీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మహమ్మద్ ప్రవక్త బోధనలు మానవాళికి మార్గదర్శకత్వం



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ అజారుద్దీన్

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మహమ్మద్ ప్రవక్త బోధనలు సమస్త మానవాళికి మార్గదర్శకత్వమని జమాతే ఇస్లామీ హింద్ రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ అజారుద్దీన్ అన్నారు. ఆదివారం ఓ హోటల్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రవక్త జన్మదిన మాసం సందర్భంగా ఉత్తమ సామాజాన్ని నెలకొల్పే దిశగా రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు చేపట్టామన్నారు. మానవ సేవయే మాధవ సేవగా భావించి విద్యా వైద్య రంగాల్లో కుల మతాలకతీతంగా సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ ఫక్రుద్దీన్, జిల్లా అధ్యక్షుడు షోహబ్ అహ్మద్‌ఖాన్, మహమ్మద్ ఖైరుద్దీన్ పాల్గొన్నారు.

దేశ నిర్మాణమే ఆర్ఎస్ఎస్ లక్ష్యం

గంగాధర, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి నిర్మాణం ద్వారా దేశ నిర్మాణం చేయడమే ఆర్ఎస్ఎస్ లక్ష్యమని ఆర్ఎస్ఎస్ విభాగ్ సహకార్యవహ కొంపల రాజన్న అన్నారు. ఆదివారం ఆర్ఎస్ఎస్ వందేళ్ల స్థాపన ఉత్సవాల్లో భాగంగా గంగాధర మండలశాఖ ఆధ్వర్యంలో స్థానికప్రభుత్వ జూనియర్ కళాశాలలో విజయదశమి ఉత్సవం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. సామాజిక సామరస్యత, కుటుంబ జీవన విలువలు ప్రతిఒక్కరూ పాటించాలన్నారు. రాబోయే రోజుల్లో జనజాగరణ ఇంటింటికి చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంపీడీవో వెంకటేశం, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం పెంపు

మానకొండూర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని ఎస్ఐ స్వాతి అన్నారు. మండలంలోని అన్నారం గ్రామంలో ఆదివారం కరీంనగర్ ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల స్థాయి నుంచి జిల్లా, రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి గ్రామానికి, తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తీసుకరావాలన్నారు. కార్యక్రమంలో మాజీసర్పంచు బొట్ల కిషన్, నిర్వాహకులు దయాకర్, ముత్తు, బబ్లు, అజయ్ పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ పోటీల్లో ధూళికట్ట విద్యార్థుల ప్రతిభ

ఎలిగేడు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధూళికట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఈనెల 19, 20 తేదీల్లో సుల్తానాబాద్‌లో పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఆటల పోటీల్లో ధూళికట్ట హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. 9వ తరగతి విద్యార్థి జల్లి నాగచైతన్య అండర్-14లో ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలకు, 8వ తరగతి విద్యార్థి సిద్దార్థ కబడ్డీ జట్టుకు ఎంపికయ్యారు. వీరి ప్రతిభకు కారణమైన వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీకాంత్‌ను, విద్యార్థులను హెచ్ఎం బిజిలి సదయ్య అభినందించారు.

పారిశుధ్య కార్మికులకు చీరలు



చీరలను అందజేస్తున్న కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి

తిమ్మాపూర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):మండలంలోని మహాత్మానగర్, తిమ్మాపూర్‌లో పారిశుధ్య కార్మికులకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి దసరా కానుకగా పట్టు చీరలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య కార్మికులు చేసే సేవలు మరువలేనివని, వారితో గ్రామాలు పరి శుభ్రంగా ఉన్నాయని ప్రశంసించారు. అనంతరం వారిని సన్మానించారు. నాయకులు వేల్పుల మల్లయ్య, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

బతుకమ్మ ఏర్పాట్లలో అధికారుల నిర్లక్ష్యం



ట్రాక్టర్‌తో చదును చేసుకుంటున్న దుర్శేడ్ వాసులు

కరీంనగర్ రూరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నగరపాలక సంస్థలో ఇటీవల విలీనమైన దుర్శేడ్ డివిజన్‌పై అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బతుకమ్మ పండుగ సందర్భంగా డివిజన్‌లోని ఎస్సీ కాలనీ మైదానంలో ఏర్పాట్లు చేయాల్సిన నగర పాలక సంస్థ అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. తామే సొంత డబ్బులు వెచ్చించి బతుకమ్మ సంబరాలకు ఆట స్థలం చదును చేసుకున్నట్లు చెప్పారు. దుర్శేడ్ మాజీ ఉప సర్పంచ్ సుంకిశాల సంపత్‌రావు రెండు రోజుల క్రితమే మున్సిపల్ అధికారులకు బతుకమ్మ ఏర్పాట్లు చేయాలని విన్నవించారని, నగర పాలక సంస్థ పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో చెత్త తరలించడానికి సంబంధించిన ట్రాక్టర్ నాలుగు రోజుల నుంచి పని చేయడం లేదని, మరమ్మతు చేయాలని కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని, బతుకమ్మ వేడుకలకు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

పేదలకు వరం సీఎమ్మార్‌ఎఫ్

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వివిధ అనారోగ్యకారణాలతో ఆస్పత్రులో చికిత్స పొందిన పేదవారికి సీఎంఆర్ఎఫ్ ఆపద్బంధువు అని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. నగర కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర కాంగ్రెస్ కార్యాల యంలోని హెల్ప్ డెస్క్ పలు సమస్యల పరిష్కారానికి వేదిక అయ్యిందన్నారు.

భగత్‌నగర్: కొత్తపల్లికి చెందిన కత్తెరపాక లక్ష్మికి సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన చెక్కును కాంగ్రెస్ నాయకుడు పొన్నం సత్యనారాయణగౌడ్ ఆదివారం పంపిణీ చేశారు. కొత్తపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్‌గౌడ్, చిలుక హన్మంతరెడ్డి, పొన్నం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



కెల్లేడులో ఒరిగిన విద్యుత్ స్తంభం

మానకొండూర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కెల్లేడులో విద్యుత్‌స్తంభం కొన్నేళ్లక్రితం వీచిన ఈదురుగాలులకు వంగిపోయింది. అప్పటినుంచి వంగిపోయిన విద్యుత్ స్తంభాన్ని సక్రమంగా చేసిన దాఖలాలు లేవు. రోడ్డుపై ఎప్పుడు కూలిపోతుందోనని గ్రామస్థులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని, విద్యుత్ స్తంభాన్ని సరిచేసి ప్రమాదాన్ని నివారించాలని గ్రామస్థులు కోరుతున్నారు.